

**ఏక శ్లోకీ భాగవతం**

ఆదౌ దేవకిదేవి గర్భజననం గోపీ గృహేవర్ధనం
మాయాపూతన జీవితాపహరణం గోవర్ధనోద్ధారణమ్।
కంసచ్ఛేదన కౌరవాది హననం కుంతీసుతా పాలనం
హ్యేతద్భాగవతం పురాణకథితం శ్రీకృష్ణలీలామృతమ్।

# రావయ్యా.. కృష్ణయ్యా!

**దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు గోలోక బృందావనం నుంచి ఈ లోకానికి దిగివచ్చిన పర్వదినం శ్రీకృష్ణాష్టమి. సర్వ స్వతంత్రుడైన కృష్ణభగవానుడు ఎప్పుడు, ఎక్కడ అవతరించాలన్నది తానే నిర్ణయిస్తాడు. శ్రీమద్భాగవతం ప్రకారం, శ్రీకృష్ణుడు బ్రహ్మదేవుడి కాలగమనం ప్రకారం వారి ఒక్కరోజు పగటికాలంలో ఒక్కసారి మాత్రమే ఈ లోకంలో అవతరిస్తాడు. మానవుడి కాలగతిలో ఇది 432 కోట్ల సంవత్సరాలకు సమానం.**

**లీలా** మనోహరుడైన నందలాల జన్మ దివ్యమైనది, అలౌకికమైనది. సకల లోకాలకూ ఈశ్వరుడైన శ్రీకృష్ణుడు ఈ లోకంలో అవతరించడానికి ఇక్కడి ప్రాపంచిక నియమాలను అనుసరించాల్సిన అవసరం లేదు. శ్రీకృష్ణుడు అవతరణ సమయంలో తన తల్లిదండ్రులైన దేవకీ వసుదేవులకు సర్వాభరణ భూషితుడైన విష్ణుమూర్తిగా తొలుత దర్శనమిచ్చాడు. తర్వాత దేవకీదేవి విన తిపై మానవ మాత్రుడైన పసివాడిలా రూపాంతరం చెందాడు. శ్రీకృష్ణుడి అసాధారణమైన ఈ ఆవిర్భావంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ఎందుకంటే, దేవదేవుని అవతరణ కేవలం వారి ఆంతరంగిక శక్తితో జరుగుతుంది కానీ, ఎలాంటి లౌకిక సదుపాయాలు, నియమాలపై ఆధారపడి ఉండదు.



ప్రాపంచిక వాస్తవాలను మనకు గుర్తు చేయడానికి, జనన-మరణాలను దాటించడానికే పరమాత్మ అవతరించాడు. శాశ్వతమైన, నిరంతరాయమైన ఆనందాన్ని పొందాలనే మనలోని కోరికను మనకు గుర్తుచేస్తూ, సనాతనమైన మన నిజ స్వరూప స్థితిని మనకు తెలిపేందుకే భగవానుడు అరుదెంచాడు. భగవద్గీత రెండో అధ్యాయంలో (2.13) అందరినీ ఆశ్చర్యపరుస్తూ, మనమంతా ఈ భౌతిక దేహాలం కాదని, ఆత్మ స్వరూపులమని శ్రీకృష్ణుడు వివరించాడు. ఆత్మస్వరూపులమైన మనమందరం శాశ్వతత్వం, నిరంతర ఆనందం, సంపూర్ణ జ్ఞానం కోసం తపిస్తున్నాం. కానీ, ఈ భౌతిక ప్రపంచం ఈ తపనలను తీర్చలేదు! అంటే, మనది కాని ఏదో పరాయి ప్రాంతంలో మనం ఉంటున్నట్టు మనకు అనిపిస్తుంటుంది. అంతర్జాతీయ హరేకృష్ణ ఉద్యమ వ్యవస్థాపకులైన ఆచార్య శ్రీల ప్రభుపాదుల వారు దీనిపై వివరిస్తూ, 'మన పరిస్థితి నీటిలో నుంచి బయటకొచ్చి నేలపై పడిన చేపలా ఉన్నద'ని అంటారు. చేప సంతోషం కోసం నేలపై దానికి ఎన్ని ఏర్పాట్లు చేసినా, అది సంతోషంగా ఉండలేదు.

### భగవానుడి వాగ్దానం

లోకంలో అధర్మం ప్రబలి ధర్మం క్షీణించినప్పుడల్లా తాను అవతరిస్తానని శ్రీకృష్ణుడు భగవద్గీతలో వాగ్దానం చేశాడు. అయితే, కలహా, కల్మషాలతో కూడిన ప్రస్తుత యుగంలో కూడా శ్రీకృష్ణుడు అవతరించి తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడా అని ఎవరైనా అనుకోవచ్చు.

అదృష్టవశాత్తూ ఆ పరమాత్మ మన మధ్యే ఉన్నాడన్నది ఊరట కలిగించే విశేషం! ప్రస్తుత కలియుగంలో శ్రీకృష్ణుడు నామ రూపంలో అవతరిస్తాడని శాస్త్రాలు పేర్కొన్నాయి! 'కలికాలే నామ రూపే కృష్ణావతార' - ప్రస్తుత యుగంలో కృష్ణావతారం శబ్దరూపంలో ఉంటుంది. ఎవరైతే ఈ కృష్ణ నామాన్ని బిగ్గరగా జపిస్తారో, వారు కృష్ణావతార ప్రత్యక్ష సన్నిధానంలో ఉన్నట్టే! సర్వశక్తిమంతుడైన భగవంతుడు అసంఖ్యాకమైన రూపాలలో అవతరించగలడు. ఆ నామ రూపాన్ని ఆచార్య శ్రీల ప్రభుపాదుల వారు పరంపరానుగతమైన మహామంత్రంగా మనకు అందించారు. అదే..

హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే।
హరేరామ హరేరామ రామ రామ హరే హరే॥

శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ఈ మహామంత్రాన్ని సదా జపించి, ఆ పరంధాముడి దివ్యానుగ్రహాన్ని పొందుదాం.

...✍ శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజి, 93969 56984

# మేక కాదు పులి

**ఉపనిషత్ వాక్యం**

సద్గురు కటాక్ష లేశ విశేషేణ సర్వసిద్ధయః
సిద్ధంతి, సర్వబంధాః ప్రవినశ్యంతి
శ్రేయో విఘ్నాః సర్వే ప్రలయం యాంతి
సర్వాణి శ్రేయాంసి స్వయం ఏవ యాంతి
(త్రిపాద్విభూతి మహా నారాయణోపనిషత్తు 5)



'సద్గురు కటాక్షంతో అన్ని సిద్ధులూ కలుగుతాయి. బంధాలన్నీ నశిస్తాయి. విఘ్నాలన్నీ తొలగిపోతాయి. శ్రేయములన్నీ వరిస్తాయి. హృదయంలో పరమాత్ముడు సాక్షాత్కరిస్తాడు..' అని పై శ్లోకానికి భావం. పరమాత్మ సాక్షాత్కారానికి గురువు అనుగ్రహం ఎంత ముఖ్యమో చెబుతూ గురువైన తోతాపురి చెప్పిన కథ రామకృష్ణ పరమహంస ఇలా వివరించారు.. 'ఒకసారి ఒక చూలాలైన ఆడపులి ఒక మేకల మందపై పడింది. అప్పుడే ఒక వేటగాడు బాణం వేశాడు. పులి ఒక పిల్లను ప్రసవిస్తూ చనిపోయింది. పులికూన మేకలమందలో కలిసిపోయింది. మేకలే పాలిచ్చి దాన్ని పెంచాయి. పులిపిల్ల మేకలతో కలిసి తిరగసాగింది. మేకలతో కలిసి గడ్డి మేసేది. మేకలతో పెరగడం వల్ల 'మే.. మే..' అనడం నేర్చుకుంది. అదే వాతావరణంలో పెరిగింది. ఏదైనా క్రూరజంతువు తరిమితే పులి భయంతో పారిపోయేది. ఒకసారి భయంకరమైన పులి మేకలమందపై దూకింది. పారిపోయే ఈ 'మేక-పులి'ని పట్టుకుంది అసలు పులి. అది వణికిపోయింది. పెద్దపులి దాన్ని నోట కరుచుకొని ఓ నీటి కొలను దగ్గరికి తీసుకుపోయింది. నీళ్లలో దాన్ని ప్రతిబింబాన్ని చూపుతూ.. 'నువ్వూ నాలాంటి పులివే! చూడు నాలాగే ఉన్నావు కదా!' అని నోటిలో మాంసం కుక్కింది. గడ్డికి అలవాటుపడిన 'మేక-పులి' మెల్లగా మాంసం రుచి చూసింది. తన నిజ స్వరూపాన్ని పోల్చుకోగలిగింది. పెద్ద పులివెంట అడవిలోకి పరుగుతీసింది.'


గురువు నీ నిజతత్వాన్ని తెలియజేస్తాడు. 'గడ్డి తినడం' అంటే, 'కామినీ కాంచనా'లలో మునిగితేలడం. 'మే..మే', అంటే పామరునిలా సంసారంలో మెలగడం. 'నీటిలో ముఖం చూసుకోవడం' అంటే ఆత్మతత్వాన్ని' అనుభూతి చెందడం. 'కొత్త పులిని అనుసరించడం' చైతన్యాన్ని మేల్కొల్పిన గురువును శరణు వేడటం.

...✍ డా|| వెలుదండ సత్యనారాయణ




**గోవర్ధన లీలలో బాలకృష్ణుడు దరిద్రనారాయణ- దీనజన సేవ, ఆర్తులను ఆదుకోవడమే పరమ ధర్మంగా ప్రకటించాడు. 'గో' అనగా ఆవు. గోవర్ధన మనగా గో సంరక్షణ, సంవర్ధనం. 'గో' అంటే భూమి. కృష్ణుడు అసురులను సంహరించి, అవనీభారం తొలగించి, ధరణిని ఉద్ధరించాడు. 'గో' శబ్దానికి వేదమని కూడా అర్థం. పరమాత్మ కనుమరుగవుతున్న వేద- సనాతన ధర్మాన్ని మనునట్లుగ ఉజ్జీవింప జేశాడు.'గో' అని ఇంద్రియానికి కూడా పేరు. అధోముఖంగా- యథా ప్రకారంగా ప్రపంచ పరంగా- విషయాల పట్ల ప్రవహించే ఇంద్రియ ధారను తన - పరమాత్మ వైపు మళ్లునట్లు చేశాడు గోవిందుడు. ఇదే గోవర్ధన లీలా పరమార్థం!**

# నంద పట్టికి గోవింద పట్టం



మన పోతన 182 మధురిమ వ భాగం

**ఇం**ద్రదేవత పూజకన్న భాగవతేంద్రుని- భక్తవరుని పూజయే మిన్న అని ఈ గోవర్ధన లీలలో కన్నయ్య నిర్ణయం! శ్రీగిరిరాజైన గోవర్ధనుడు హరిదాసవర్యుడు- భక్తులలో శ్రేష్ఠుడు. భగవంతునికి చాల ఇష్టుడు. భగవల్లీలలో జడ- చేతన భేదం- తేడా పొడసూపదు. భగవత్పూజ లేక భాగవత పూజ- భక్తి సిద్ధాంత రీత్యా నిండైన ఈ రెండు విధాల పూజకే చెల్లుబాటు. సురపతి ఇంద్రుని మతిలో అసుర భావం- అహంకారం ముసురుకొంది. తన ఇష్టానికి- ఇష్టి (యాగాని)కి నష్టం వాటిల్లిందని రుష్టుడై, కోపావిష్టుడై దుష్టభావంతో అతడు అమాయక ప్రజలకు, పశువులకు నష్టం కలిగించాలని ఉపలవృష్టి- రాళ్లవాన కురిపించాడు. 'నక్రోధో న చ మాత్సర్యం..' కాని, భగవంతుని యందు, భక్తుని యందు రోషావేశాలు ఎప్పుడూ ఉండవు. ఇంద్రుడు గోజాతిని నశింప జేయ పూనగా ఉపేంద్రుడు కృష్ణచంద్రుడు 'గోవర్ధనుడు' దానిని రక్షించి వృద్ధి పరచాడు. అదృష్ట- పరోక్షమైన ఇంద్రుని కాక, దృష్ట- ప్రత్యక్షమైన దైవాన్ని పూజింప చేసి, పుణ్యాన్ని అందరికీ పంచిపెట్టాడు.

శుకముని అవనీపతితో- పరీక్షిత్ భూజానీ! గోవర్ధన గిరిని గొడుగుగా పైకెత్తి పట్టిన గోపాల శిరోమణి, గోప గోపీ రమణలను కని భయపడవద్దని ఊరడిస్తూ ఇలాగని పలికాడు.. గోప వనితలారా! కలత పడకండి. గోపకులారా! కొండల మందక- కలవరపడక మీమీ పసుల మందలతో వచ్చి మీకు నచ్చిన చోట ఈ కొండ క్రింద నిలవండి.

**శా|| 'బాలుండీతడు, కొండ దొడ్డది, మహాభారంబు సైరింపగా జాలండో?యని దీనిక్రింద నిలువన్ శంకింపగా బోల, దీ శైలాంభోనిధి జంతు సంయుత ధరా చక్రంబు పైబడ్డ నా కేల్లాడదు బంధులార! నిలుడీ క్రిందన్ ప్రమోదంబునన్'**

'ఓ బంధువులారా! ఈతడు బాలకుడు. ఈ కొండా! చాలా పెద్దది. కరవుతీర నిండా బరువైనది. మోయగలడో లేడో అని కింద నిలువడానికి సందేహించకండి. శైలాలు- కొండలు, సాగరాలు, సకల జంతుజాలంతో నిండిన ఈ ఇల- భూమండలమంతా మీదపడ్డా నాకేలు- చేయి చలించదు. ఇక మీకేల సంశయం? మీరందరూ ఆనందంగా దీని కింద చేరండి' ఇలా అన్న నందనందనుని పలుకులు గోపకులు మనఃస్ఫూర్తిగా నమ్మి బంధు, మిత్ర పరివార సహితంగా తమతమ తావులలో ఆవుదూడలతో పాటు నిలిచారు.

**మ|| 'హరి దోర్దండము గామ; గుబ్బ శిఖరం; బాలంబి ముక్తావళుల్ పరగన్ జారెడు తోయ బిందువులు; గోపాలాంగనాపాంగ హా స రుచుల్ రత్న చయంబుగాగ; నచల చ్ఛత్రంబు శోభిల్లె ద ద్గిరి భిద్దుర్మద భంజియై జలధరా క్లిన్న ప్రజారంజియై'**

శుకుడు- రాజా! 'శ్రీహరి ధరించిన గిరి అనే గొడుగు కొండల రెక్కలను ఖండించిన ఆఖండలు- ఇంద్రుని దురహంకారాన్ని భంజిస్తూ, ప్రళయంకర జలదా(మేఘా)ల జలధారలకు విలవిల్లాడిన గోకుల వాసుల ఉల్లము (మనసు)లను రంజిల్ల జేస్తూ విరాజిల్లింది. ఆ కొండ గొడుగుకు నందగోకుల మండనుని భుజదండమే కర్ర. శిఖరమే గుబ్బ. శైలంపై నుంచి జారుతున్న జల బిందువులే దాని చుట్టూ వ్రేలాడుతున్న ముత్యాల జాలరులు. మందలోని ఇందువదన- గోపకాంతల క్రీగంటి చూపుల, మంద హాసాల జిలుగులే రత్నాల వెలుగులు.' సాంగ రూపక అలంకార కలంకారీ కలితమైన పై లలిత మాతంగ- మత్తేభ వృత్తం పోతన మహాకవి అద్భుత కల్పనా జల్పితం- ఆభాషితం!

**క|| 'వడిగొని బలరిపు పనుపున నుడుగక జడిగురిసె నేడహోరాత్రము, ల య్యెడ గోపజనులు బ్రదికిరి జడి దడియక కొండ గొడుగు చాటున నధిపా!'**

రాజా! 'బిడౌజు (ఇంద్రు)ని ఆనతిచే ఎడతెరపి లేక ఏడు అహోరాత్రాలు జోరున జడివాన కురిసింది. ఆ అచలచ్ఛత్రం- కొండ గొడుగు అండన గొల్లలెల్లరూ ఏమాత్రం దడవ(భయపడ)కుండా, కుండపోత వాన వాత పడుకుండా- తడవకుండా మనగలిగారు.'

గోవర్ధననాథుని దివ్య స్వరూపం గోకుల బృందావన వాసులకు ఏడు దినాల వరకు అనామయం- దేహం మీద ధ్యాస లేకుండా చేసింది. అటుపై ఆకలి దప్పికలనూ మటుమాయం కావించింది. ఈ మాదిరి- తీరున, సప్త వాసరాలు కరివరదుడు, మందరగిరిధారి హరి గోవర్ధనగిరిని ధరించి నందవ్రజ ప్రజల ఆర్తిని హరించాడు. విసిగి వేసారిన వాసవుడు- ఇంద్రుడు వాసుదేవుని భాసుర వీరచరితం కని విని అభాసు(నవ్వుల) పాలయ్యాడు. తన మనోరథం వ్యర్థం కాగా మేఘాలను మరలించుకొని తరలిపోయాడు. వాన వెలియగానే గగనాన భానుని ప్రభ కానవచ్చింది. కొండ కింద ఉన్న మంద(వ్రజ) వాసులను తమ ఆలమందలతో వెలుపలికి రమ్మని ఆనతీయగా అందరూ వెడలివచ్చారు. అంతట, బాలకృష్ణుడు శైలాన్ని దించి యథాస్థానంలో ఉంచాడు. ఈ నల్లవాడు తమను చల్లగా కాపాడినాడని వల్లవులు- గొల్లలెల్లరూ పల్లవించిన ఉల్లములతో బాలకృష్ణుని పలువిధాల ప్రశంసించారు. కాలరూపుని అచ్యుతుని ఆలింగనం చేసుకొని ఆశీర్వదించారు. నంద యశోదాదులు నందనుని పరమానందంతో అక్కున జేర్చుకొని పెక్కు శుభవాక్యాలు వక్కాణించారు. ఆకాశ సంచారులు విరులు కురియించారు. సురులు శంఖాలు, దుందుభులు మ్రోగించారు. అంబర వీధిలో తుంబురాది గంధర్వులు సంబరపడుతూ పాడారు. నల్లనయ్య గొల్లలతో గోవులతో కూడి మెల్లగా గోష్ఠం- వ్రేపల్లె చేరాడు.

రాజా! అనంతరం, బాలగోపాలుని లీలా విలాసాలు ఆలపిస్తూ గోపాల జనం చాల విస్మయపడి నందరాజుతో ఇలా విన్నవించుకున్నారు..

**క|| ఏడేండ్ల బాలుడెక్కడ? క్రీడం గరి తమ్మి యెత్తుక్రియ నందఱముం జూడ గిరి యెత్తుటెక్కడ? వేడుక నొకకేల నేడు వెఱగౌ గాదే?...**

'ఏడేళ్ల పిల్లవాడెక్కడ? ఏనుగు అరవిందా(పద్మా)న్ని ఎత్తిన చందంగా, మనమందరం చూస్తుండగా, అందంగా అద్రి (కొండ)ని భద్రంగా పైకెత్తడమెక్కడ? ఇది ఎంత వింత? గోపనాయకా! నందా! నీ పాపడు మానవమాత్రుడు కాడయ్యా! సాక్షాత్ మాధవుడయ్యా!' అంటూ కృష్ణుని, విష్ణు అవతారమని ఎంచి సేవించారు.

హరి ఒక కేల- చేతితో లీలగా శైలాన్ని ఎత్తిపట్టి తాను (ఇంద్రుడు) ఆకుల పరచిన- కలవరపెట్టిన గోకులాన్ని కాపాడినాడని విని నాకపతి పాకశాసనుడు పశ్చాత్తాపపు కాక (వేడిమి)తో పరితపించాడు. త్రిలోకపతిననే అహంకారానికి తిలోదకాలిచ్చి ఆ గిరిభిత్తు- ఇంద్రుడు అణకువతో సురభిని- కామధేనువుని ముందిడుకొని అమరావతి నుంచి అరుదెంచాడు. దుష్టులైన మానవేంద్రుల దురహంకార, దురితాలను దూరీకరించు వాడు, అపార కరుణానిధి అయిన నందనందనుని సందర్శించి, ఆయన పాదారవిందాలను సేవించాడు. అంజలి ఘటించి అమర ప్రభువు, ఆపన్న ప్రపన్నుడు కంజదళాక్షునితో ఇలా విన్నవించుకొన్నాడు.. అనంతా! ఒక్కొక్క లోకాన్నీ పాలిస్తూ- చక్కబరుస్తూ, మిక్కిలి మదంతో నిక్కుతూ, నీలుగుతూ నిఖిలానికీ నేనే ప్రభువునని ఒడలు మరచి మసలుకొనే నావంటి జడులు- ఉన్మాదులు నిజంగా నీ మహిమను తెలియనేరరు.

**ఆ|| 'వాసుదేవ! కృష్ణ! వరద! స్వతంత్ర! వి జ్ఞానమయ! మహాత్మ! సర్వపుణ్య పురుష! నిఖిల బీజ భూతాత్మక బ్రహ్మ! నీకు వందనంబు నిష్కళంక!'**

'వసుదేవనందనా! నీకు వందనాలు. వాసుదేవా! నీ దాసుణ్ని. అపరాధిని, తప్పు సైరించి నన్ను మన్నించు.' వాసవుని వాక్కులు విని వాసుదేవుడు దరహాసం చిందిస్తూ, మేఘ గంభీరమైన అమోఘ ఘోషతో ఇలా పలికాడు- 'సురేశ్వరా! సంపదచే కన్ను మిన్ను కానక నీవు నన్ను కూడ కానకున్నందున, నీ మదాతిరేకం రూపు మాన్పడానికే ఈ నీ యాగాన్ని నేను మానిపించాను. ఐశ్వర్యం వల్ల మత్తిల్లిన- మదించిన వారు దండ ధారినైన నా ఊసెత్తరు. ఓ వాసవా! వాస్తవంగానే నేనెవణ్ని రక్షింప దలుస్తానో, వానిని ఇలా శిక్షిస్తా- వాణ్ని ధనహీనునిగా చేస్తా. సితకరిగమనా- ఓ ఐరావత వాహనా! నీ అల్ప ప్రభుత- అధికారంతో అనల్పంగా గర్వించకు. నా ఆనతి నిర్వర్తిస్తూ నీ అధికారం నిలుపుకో. నీకు శుభమగు గాక! వెళ్లిరా.' రాజా! గోగణంతో కూడి ఉన్న కామధేనువు- సురభి, భక్తజన కామధేనువైన దామోదరునికి ప్రణమిల్లి ఇలా పలికింది..

**క|| విశ్వేశ! విశ్వభావన! విశ్వాకృతి! యోగివంద్య! విను నీ చేతన్ శాశ్వతుల మైతి మిప్పుడు శాశ్వతముగ గంటి మధిక సౌఖ్యంబు హరీ!**

'విశ్వేశ్వరా! విశ్వకల్యాణ మూర్తీ! విరాడ్రూపా! పరమ యతీశ్వరులచే నుతింపబడువాడా! నా విన్నప మాలకించు. నీ అనుగ్రహం చే మేమిప్పుడు శాశ్వతులం- శుభ చిత్తులమయ్యాం. మాకు సుస్థిరమైన గొప్ప సౌఖ్యం సమకూరింది.' దేవా! నీవే మాకు పరమదైవం, ప్రభువు. సర్వలోక సౌఖ్యం కొరకు నీకు పట్టం కట్టమని నీటి పుట్టుగు పట్టి- బ్రహ్మదేవుడు నన్ను నియమించి పంపాడు. ఓ గిరిధారీ! నీవే ఈ భూభారాన్ని నివారించడానికి అవతరించిన శ్రీహరివి. శుకుడు- రాజా! అనంతరం అమర ప్రభువు, దేవమాత అదితి మరియు మహర్షుల సమక్షంలో, కామధేనువు క్షీరంతో, ఐరావతం తన శుండాలం- తొండంతో కొని తెచ్చిన దివ్య ధునీ (గంగా) జలాలతో- రణరంగంలో విపక్షులను శిక్షించువాడు, సాధు సంరక్షకుడు అయిన జలజాక్షుని, గోవులకు గోపకులకు అధిపతిగా 'గోవిందుడు' అని నామకరణం చేసి అభిషేకించాడు. పావనమైన ఆ పాలు, గంగాజలాలు నిలిచిన ప్రదేశం నేటికీ 'సురభికుండం'గా ప్రశస్తి పొందుతోంది.




తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)

# కోపాన్ని గెలుద్దాం

**ఇస్లాం బోధ**

వల్ కాజిమీనల్ గైజ
వల్ ఆఫీన అనిన్నాసి
వల్లాహు యుహిబ్బుల్ ముహ్ సినీన్
(ఖురాన్ 3:134) కోపాన్ని నిగ్రహించుకునేందుకు ఈ వాక్యాన్ని పదేపదే చదవాలని ఉలమాలు చెబుతుంటారు. మనిషికి కోపం రావడం సహజం. కానీ, ఆ కోపం ఎన్నో అనర్థాలకు దారితీస్తుంది. రక్తసంబంధాలను దెబ్బతీస్తుంది. కోపంలో నోరు జారే మాటలు మనవాళ్లను దూరం చేస్తాయి. కోపానికి గురైన ప్రతిసారీ ఏదో ఒక నష్టం తప్పదు. కోపం ఎన్నో మానసిక, శారీరక రుగ్మతలకు కారణం అవుతుంది. ఇలా ఎన్నో కష్టనష్టాలు కలుగజేసే కోపాన్ని అణచుకోవాలని ఖురాన్ పేర్కొన్నది. 'కోపాన్ని దిగమింగేవారు, ఇతరుల తప్పులను క్షమించేవారు.. ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ప్రీతి'- అని పై ఖురాన్ వాక్య భావం.



అల్లాహ్ మీద భయభక్తులు కలవారు ఎదుటివారిని కోపగించుకోరాదు. యుద్ధ మైదానంలో శత్రువులను చిత్తుచేసేవాడు కాదు వీరుడు, కోపాన్ని అణచివేసుకున్నవాడే ధీరుడు అంటారు ప్రవక్త (స). కోపం షైతాను ద్వారా వస్తుంది. షైతాన్ అగ్ని స్వరూపుడు. అందుకే కోపం వచ్చినప్పుడు మంచినీళ్లు తాగాలని ప్రవక్త (స) చెప్పారు. నిల్చుని ఉన్నప్పుడు కోపం వస్తే కాసేపు కూర్చోవాలనీ, కూర్చుని ఉన్నప్పుడు ఆగ్రహం వస్తే.. పడుకోవాలని సూచించారు. 'కోపం వచ్చినప్పుడు కూడా క్షమించేవారి కోసం అల్లాహ్ దగ్గర శ్రేష్ఠమైన సుఖ సౌఖ్యాలు ఉన్నాయ'ని ఖురాన్ చెబుతున్నది.

...✍ ముహమ్మద్ ముజాహిద్
96406 22076

# ప్రభువు కోరుకున్నది..

**క్రీస్తు సందేశం**

**వెయ్యిమందిలో** కూర్చున్నా క్రైస్తవుని గుర్తుపట్ట గలిగినపుడే.. అతని క్రైస్తవ్యానికి ధన్యత. క్రీస్తు కోరుకున్నది, పరిపూర్ణ క్రైస్తవ్యం వాంఛించిందీ ఇదే! ప్రభువును అనుసరించడమే క్రైస్తవ్యం. క్రీస్తు అంటే ఆషామాషీ పదం కాదు. అది ప్రేమకు, త్యాగానికి సంకేతం. క్రీస్తు తోటివాణ్ని ప్రేమించడానికి ఆనవాలు. ఆయన్ను అనుసరించడం, అనుకరించడం మామూలు విషయం కాదు. కష్టంతో కూడుకున్నదే. క్రీస్తు అనగానే సిలువ కనిపిస్తుంది. సిలువపై కొన ఊపిరితో కొట్టిమిట్టాడుతూ వేలాడే ప్రభువు కనిపిస్తాడు. మరణిస్తున్న సమయంలో క్రీస్తు ఇచ్చే సందేశాలు సుఖతరంగా ఉండవు. ఆనందంగా చెప్పుకొనేవీ కావు. అటువంటి క్రీస్తులా ప్రవర్తించేవాడే నిజమైన క్రైస్తవుడు. క్రీస్తు సందేశాన్ని తన ప్రవర్తనతోనే నిర్వచిస్తూ, ఆ సూక్తిని మోసుకుపోయి లోకానికి అందించేవాడు క్రైస్తవుడు. లేకపోతే అతను అన్యుడే. క్రైస్తవుడనని చెప్పుకోవడానికే అనర్హుడే. హింసలు భరించడం తప్ప ఎదురు తిరిగి ప్రతిదాడి చేయడం కోరుకోనిది క్రైస్తవం. దేవుణ్ని పరిపూర్ణంగా పూజించాలని ఎంత గాఢంగా చెబుతుందో, అంతే మోతాదులో సాటివాణ్ని ప్రేమించాలని క్రైస్తవం ఆజ్ఞాపిస్తుంది. అంటే, దైవారాధన.. ప్రేమగా పరిణామం చెందాలన్నమాట. మనల్ని మనం ప్రేమించుకున్నట్టే, మరొకరిని ప్రేమించాలి! అదే ప్రభువు బోధించినది. క్రైస్తవం కోరుకున్నది.

...✍ ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024